క్లుప్తంగా

75 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఉయ్యాలవాడ : మండలంలో జూన్ నెలకు సంబంధించిన పింఛన్ పంపిణీ 75 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రఘురాం సోమవారం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,935 మంది పింఛన్‌దారులకు రూ.1,16,13,000 ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 3,005 మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయగా ఇప్పటి వరకు 2,278 మంది లబ్ధిదారులు రూ.90,15,000 ఆయా బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకున్నారని చెప్పారు. అలాగే 11 సచివాలయాల పరిధిలో దివ్యాంగులు, గృహాలకు పరిమితమైన 930 మందిలో 854 మందికి సచివాలయ ఉద్యోగులు వెళ్లి రూ.23,70,500 అందజేశారని వివరించారు.

అడ్మిషన్లు ప్రారంభం

శిరివెళ్ల: 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రథమ సంవత్సరానికి మొదటి విడతగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ అనంతరం ఇంటర్మీడియెట్ ఒరిజనల్ టీసీ, ఇంటర్, 10వ తరగతి మార్కు లిస్ట్, పాస్ ఫొటో, 4- ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లతో వచ్చి కళాశాలలో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది కళాశాలకు ఎస్‌సీసీ యూనిట్ మంజూరయిందని చెప్పారు.

ఆ భూములను పేదలకు కౌలుకివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): దేవాలయాల భూములను పేదలకే కౌలుకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అధికారులను కోరారు. సోమవారం దేవదాయశాఖ అధికారి లేకపోవడంతో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది వర్షాభావం వల్ల పంట నష్టపోయిన రైతులకే మళ్లీ కౌలుకు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో మాన్యం కౌలు వేలాల్లో పేదలకు అవకాశం ఇవ్వాలన్నారు. నష్టపోయిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం తదితర పథకాలను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సుబ్బరాయుడు రామచంద్రుడు, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిల రికవరీ



తుడుమలదిన్నెలో పొదుపు మహిళ నుంచి బకాయిలను వసూలు చేస్తున్న సెర్ప్ టీమ్

ఉయ్యాలవాడ : మండలంలో స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రుణ బకాయిలు రూ.7,05,320 రికవరీ చేశామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం దాసు సోమవారం తెలిపారు. ఉయ్యాలవాడ కార్యాలయం పరిధిలో రూ.48 లక్షలు రికవరీ చేయవలసి ఉండగా సెర్ప్ టీమ్ సభ్యులు గ్రామాలు సందర్శించి పొదుపు గ్రూపు సభ్యులతో సమావేశమై తీసుకున్న రుణాలపై చర్చించారన్నారు. తుడుమలదిన్నె, అల్లూరు, సుద్దమల్ల, హరివరం, రూపనగుడి, బోడెమ్మనూరు, సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె గ్రామాల్లోని పొదుపు మహిళల నుంచి సెర్ప్ టీమ్ బృందం ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు వివరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాగలమర్రి: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య సోమవారం తెలిపారు. స్థానిక చాగలమ్మ గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన నరసింహులు 40 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

మండల కేంద్రం సమీపంలోని పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడి చేసి నంద్యాల, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మొత్తం పది మందిని అరెస్టు చేసి రూ.5,600 నగదు, కోడిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.



ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు



కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

ప్రజాతీర్పు నేడే

- శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నంద్యాల ఓట్ల లెక్కింపు
- ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు
- విజేతలకు సాయంత్రం 6 గంటలకు డిక్లరేషన్ అందజేత
- రాజకీయ పార్టీల్లోనే కాకుండా జనాల్లోనూ టెన్షన్
- 2019 ఫలితాలు ప్రతిబింబిస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకుల ధీమా



నంద్యాల: గత నెల 13న ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేసిన ఓట్ల లెక్కింపు నేడు జరుగనుంది. సార్వత్రిక ఎన్నికల ప్రజాతీర్పు వెలువడనుండటంపై అందరూ ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. మంగళవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నంద్యాల నియోజకవర్గంలో 2,73,932 మంది ఓటర్లు ఉండగా 2,05,190 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 74.90 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పురుష ఓటర్లు 99,744మంది, మహిళలు 1,05,391మంది, ఇతరులు 55 మంది 286 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా 286 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో ఉన్న ఓట్లను 21 రౌండ్లలో పూర్తి చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఉదయం 8గంటలకు కౌంటింగ్..

నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొదటగా ఈవీఎంల లెక్కింపు తొలి రౌండ్‌కు అరగంట సమయం పడుతుంది. రెండో రౌండ్ నుంచి 20 నిమిషాలు మాత్రమే తీసుకుంటుంది. నంద్యాల నియోజకవర్గానికి సంబంధించిన ఫలితం మధ్యాహ్నం 2 గంటలకు పూర్తయ్యే అవకాశం ఉంది. మరో అరగంట పాటు వీవీప్యాట్ స్లిప్పులను ర్యాండమ్‌గా లెక్కిస్తారు. గెలుపొందిన అభ్యర్థులకు సాయంత్రం 6గంటలకు డిక్లరేషన్ అందజేస్తారు.

మహిళలు, వృద్ధులు వైఎస్సార్‌సీపీకే..

2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిపై 32,427 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా ఎన్‌ఎండీ ఫరూక్ తలపడ్డారు. వీరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్‌లో సైతం నంద్యాలలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని వెల్లడించడంతో వైఎస్సార్‌సీపీ నాయకుల్లో ధీమా వ్యక్తమవుతుంది. ఈ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు అధిక శాతం మంది వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని విశ్లేషకులు చెబుతున్నారు. కౌంటింగ్ సమయం దగ్గర పడటంతో ఎక్కడ చూసినా ఫలితాలపై చర్చ సాగుతోంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

ఎన్నికల్లో విజేతలు ఎవరు, పరాజితులు ఎవరు, ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది, యువత, మహిళలు, వృద్ధులు ఎవరికి పట్టం కట్టారో.. లాంటి ప్రశ్నలకు నేడు మధ్యాహ్నం 3గంటల్లోపు పూర్తి స్పష్టత రానుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం వారి అంచనాలతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా పోలింగ్ సరళి, పెరిగిన శాతం, ప్రధానంగా మహిళల ఉత్సాహంపై విశ్లేషణలు చేస్తున్నారు.



చర్చిలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలవాలని ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని గోపాల్‌నగర్‌లో వెలసిన ఆంజనేయస్వామి, దర్గా, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. విద్యార్థి విభాగం, జేసీఎస్ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి మాట్లాడుతూ దేవుని దయ, ప్రజలందరి ఆశీస్సులతో పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుతూ సర్వమత ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. శ్రీనివాసులు, సంపత్, షాకీర్, చైతన్య, లక్ష్మీదేవి, యువరాజ్, శ్రీరాములు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దర్గాలో పూజలు చేస్తున్న దృశ్యం

విజయోత్సవాలు నిషేధం



కేంద్ర బలగాలతో పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న సీఐలు (ఫైల్)

ఆళ్లగడ్డ: కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు నిర్వహించొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధించినా సంయమనంతో ఉండాలని, గొడవలు, ఘర్షణలకు దిగొద్దని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా సోమవారం తెల్లవారు జాము నుంచే కేంద్ర ప్రత్యేక పోలీస్ బలగాలతో అనేక ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయా గ్రామాల్లో జరిగే పరిస్థితులపై ఆరా తీశారు.

కోడ్ ఉల్లంఘించొద్దు

ఓట్ల లెక్కింపు, ఫలితాల వెలువడిన అనంతరం విజయోత్సవాలు పూర్తిగా నిషేధం. ఈనెల 6వ తేదీ రాత్రి వరకు ఎన్నికల కోడ్ ఉంటుంది. అంతవరకు తమ నాయకులను కలిసేందుకు గ్రామాల నుంచి కార్యకర్తలు రాకూడదు. రోడ్లపై గుంపులుగా కనిపిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఫలితాల అనంతరం అందరూ కలసి మెలసి శాంతియుతంగా జీవించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తాం.

– రమేష్‌బాబు, సీఐ

జగన్ సీఎం కావాలని ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని కోరుతూ పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీబ్రహ్మానందీశ్వరస్వామికి దేవస్థానం మాజీ చైర్మన్ చెంచుగారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని చెప్పారు. దండె సుధాకర్, అల్లూరయ్య, శంకర్ పాల్గొన్నారు.

అధికారి రాక..పింఛన్ అందక!



పేరూరు గ్రామ సచివాలయంలో పింఛన్ సొమ్ము కోసం వేచి ఉన్న వృద్ధురాలు

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి పింఛన్ దారులకు అవస్థలు తప్పలేదు. పింఛన్ సొమ్ము తీసుకునేందుకు గ్రామ సచివాలయాలు,బ్యాంకులు, బ్యాంకు మిత్రలు, పోస్టాఫీసులు,రచ్చ బండల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. మూడు రోజులు గడిచినా తనకు ఈనెల పింఛన్ సొమ్ము అందలేదని బి.నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుర్రమ్మ అనే వృద్ధురాలు సోమవారం ఉదయాన్నే కుమారుడి సాయంతో పేరూరు గ్రామ సచివాలయానికి చేరుకుంది. అయితే ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది లేక పోవడంతో నిరీక్షించాల్సి వచ్చింది. 12 గంటలకు వచ్చిన సిబ్బంది వృద్ధురాలి వేలిముద్ర వేయించేందుకు యత్నించినా పడలేదు. పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఆమెకు పింఛన్ అందలేదు. అయితే కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి సక్రమంగా కార్యాలయానికి హాజరవరని, నెలకోమారు వస్తారని గ్రామస్తులు తెలిపారు. ఎందుకు రారని ప్రశ్నిస్తే వివిధ కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామచంద్రను ప్రశ్నించగా.. కార్యదర్శి సక్రమంగా విధులకు నిర్వర్తించడం లేదని తెలియడంతో ఇప్పటికే మెమో ఇచ్చాం. రెండు, మూడు సార్లు హెచ్చరించినా మార్పులేదు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని డీపీఓ కార్యాలయానికి నివేదించామని తెలిపారు.

విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఉమామహేశ్వర ఆశ్రమంలో విద్యార్థులకు భగవద్గీత 12వ అధ్యాయనంలోని భక్తియోగ శ్లోకాల పోటీలు సోమవారం నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు జూనియర్ విభాగంగా, 6 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగంగా నిర్ణయించారు. జూనియర్ విభాగంలో రితన్య మొదటి బహుమతి సాధించగా, మహేశ్వర్, సురక్ష వరుస స్థానాల్లో నిలిచారు. సీనియర్ విభాగంలో షణ్ముఖేశ్వరి మొదటి బహుమతి, దీక్షిత, లక్ష్మి గాయత్రి తరువాతి బహుమతులు గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా వరలక్ష్మి, అనుమాదేవి వ్యవహరించారు. శ్రీగీతా పారాయణ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

దోమల నివారణతో ఆరోగ్యం



మలేరియా మాసోత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: దోమలు, దోమ కాటుని నివారించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తమ పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పుల లాంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు.

లక్ష్యాన్ని చేరుకోండి..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో సోమవారం గాంధీనగర్ యూపీహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా ఎలిమినేషన్ స్టేజ్‌లో ఉన్నామని, ల్యాబ్ టెక్నీషియన్లు విరివిగా మలేరియా పరీక్షలు నిర్వహించి లక్ష్యాలను పూర్తి చేసి రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ క్షయ వ్యాధి పరీక్షలను త్వరిత గతిన పూర్తి చేయాలని చెప్పారు. సహాయ మలేరియా అధికారి జి.వరప్రసాద్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

భారీ వర్షం

- ఉప్పొంగి ప్రవహిస్తున్న కుందూనది
- పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- భూములు అదును కావడంతో వంటల సాగుకు రైతుల యత్నాలు



ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ఆళ్లగడ్డ: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం రాత్రి వర్షం దంచి కొట్టింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురవడంతో పొలాలు పదునయ్యాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే అనేక గ్రామాల్లో మిరప నారు నాటుకునేందుకు కూలీలతో కలిసి రైతులు పరుగులు తీశారు. ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

ఉయ్యాలవాడ : నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో మండలంలో గాలివాన భీభత్సం సృష్టించింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలు గ్రామాలలో చెట్లు నేలకొరిగాయి. 27.08 ఎం.ఎం., వర్షపాతం నమోదైంది.



కాకరవాడ వద్ద నేలకొరిగిన చెట్టు



దొర్నిపాడు పరిసర పొలాల్లో నిలిచిన నీరు

దొర్నిపాడు: మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే క్రిష్టిపాడు వద్ద కుందూనదిలో వరదనీరు చేరడంతో బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. మండలంలో 63.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన రోజే భారీ వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నదికి వర్షపు నీరు చేరడంతో భారీగా గుర్రపు డెక్క కొట్టుకొస్తోంది దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది.



పేరూరు సమీపంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు



ఎర్రగుడిదిన్నె వద్ద వర్షపు నీటిలో మునిగిన మినుము పైరు

రుద్రవరం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం ఎడ తెరపి లేకుండా కురిసింది.దీంతో పొలాల్లో నీరు నిలిచింది.అలాగే వాగులు,వంకల్లో వర్షపు నీరింది. నైరుతి రుతు పవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కురిసిన వర్షానికి పొలాల్లో సేద్యపు పనులు మినుము,మొక్క జొన్న వంటి పంటల సాగు ఊపందుకోనున్నాయి. అయితే మండలంలోని ఎర్రగుడిదిన్నె,పేరూరు, చిలుకలూరు,మాచినేనిపల్లె,బి.నాగిరెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలో రైతులు దాదాపు 200 ఎకరాల్లో ముందస్తుగా మినుము పంట సాగు చేశారు. ఆ పంట ప్రస్తుతం మొలక దశలో ఉంది. ప్రస్తుతం విస్తారంగా వర్షం కురవడంతో ఆ పంట అంతా నీట మునిగింది. పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు.